https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 AM TO 10 AM

సంపుటి: 01 | సంచిక:28 | పేజీలు :02 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | ఆదివారం, సెప్టెంబర్ 12,2026




# ఏకపక్ష యుద్ధాలు తగవు..

- ఉగ్రవాదాన్ని మేమందరం తీవ్రంగా ఖండిస్తున్నాం
- అమెరికా డాలర్ బదులు మన స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం
- న్యూఢిల్లీ బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాల ఆమోదం

**న్యూఢిల్లీ:**

**దేశ రాజధాని ఢిల్లీలో శనివారం జరిగిన బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాల నేతలు న్యూఢిల్లీ ప్రకటనను ఆమోదించారు. కూటమి సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏకాభిప్రాయ పత్రాన్ని ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి(యూఎన్ఎస్సీ)లో 'నిర్మాణాత్మక మార్పు' సహా బహు పాక్షిక సంస్థల్లో సంస్కరణలు చేపట్టాలని ప్రకటన పిలుపునిచ్చింది. ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించింది. 'ఏకపక్ష యుద్ధ చర్యలను' ఖండిస్తూ, పశ్చిమాసియాలో కొనసాగుతున్న సైనిక దాడుల నేపథ్యంలో సముద్రయాన సిబ్బంది, వాణిజ్య నౌకాయానానికి భద్రత కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.సదస్సుకు హాజరైన భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు.. ఐక్యరాజ్య సమితిలో, ముఖ్యంగా భద్రతా మండలిలో మరింత కీలకపాత్ర పోషించాలన్న బ్రెజిల్, భారత్ ఆకాంక్షలకు తమ మద్దతును పునరుద్ఘాటించాయి.**

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12**

బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం ఇకపై అమెరికా డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీల్లో మరింతగా నిర్వహించాల్సి ఉందని ప్రకటన పేర్కొంది. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రాంతాలకు చెందిన అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించేలా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలని ప్రత్యేకంగా పిలుపునిచ్చింది.'మారుతున్న ప్రపంచాన్ని పాతబడిపోయిన సంస్థల ద్వారా నడిపించలేమన్నది నేటి చర్చ స్పష్టం చేసింది. ప్రాతినిధ్యం, స్పందన, నియమాల రూపకల్పనలో సంస్కరణలు అత్యవసరం' అని ప్రధాని మోదీ అన్నారు. 'భవిష్యత్తు సాంకేతికతల అభివృద్ధిలో, వాటిని నియంత్రించే నిబంధనల రూపకల్పనలో గ్లోబల్ సౌత్‌కు సమాన భాగస్వామ్యం ఉండాలని కూడా మేము స్పష్టం చేశాం' అని తెలిపారు. 'ఈరోజు ఆమోదించిన న్యూఢిల్లీ ప్రకటన మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశాన్ని బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థ చాలాకాలంగా కీలక మలుపులో ఉందని మేము గుర్తిస్తున్నాం. డబ్ల్యూటీవో నిబంధనలకు అనుగుణంగా లేని వాణిజ్య పరిమితి చర్యలు పెరుగుతున్నాయి. విచక్షణా రహితంగా సుంకాలు, ఇతర పన్నులు పెంచడం ద్వారా లేదా పర్యావరణ లక్ష్యాల పేరుతో రక్షణాత్మక విధానాలను అనుసరించడం వంటి చర్యలు ప్రపంచ వా ణి జ్యా న్ని మరింత తగ్గించే, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించే, అంతర్జాతీయ ఆర్థిక వాణిజ్య కార్యకలాపాల్లో అనిశ్చితిని సృష్టించే ప్రమాదం ఉంది. ఇవి ఇప్పటికే ఉన్న ఆర్థిక అసమానతలను మరింత తీవ్రతరం చేసి, ప్రపంచ ఆర్థిక అభివృద్ధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు' అని ప్రకటన పేర్కొంది.'ఏ ఉద్దేశంతో ఎక్కడ ఎప్పుడు ఎవరి ద్వారా జరిగినా ఉగ్రవాద చర్యలన్నింటినీ నేరపూరితమైనవి, సమర్థించలేనివిగా మేము ఖండిస్తున్నాం. 2025 జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని అత్యంత తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడిలో 25 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. ఉగ్రవాదులు సరిహద్దు దాటి రాకపోకలు సాగించడం, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదులకు సురక్షిత ఆశ్రయాలు కల్పించడం సహా అన్ని రూపాలు, వ్యక్తీకరణల్లో ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం.ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నవారితో పాటు వారికి మద్దతు ఇచ్చిన వారందరినీ బాధ్యులుగా చేసి, సంబంధిత జాతీయ, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా న్యాయస్థానం ముందు నిలబెట్టాలి' అని ప్రకటన పేర్కొంది. అయితే ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులపై ఇలాంటి సంయుక్త ప్రకటన పె ద్ద గా ప్రభావం చూపకపోవచ్చని నిపుణులు అంటున్నారు. అయితే పాశ్చాత్య దేశాల ఆంక్షల వంటి ఆర్థికంగా నష్టపరిచే విధానాలకు వ్యతిరేకంగా అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి ఐక్యతను ప్రదర్శించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.'బ్రిక్స్'లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ఉన్నాయి. అమెరికా, దాని పాశ్చాత్య మిత్ర దేశాల ఆధిపత్యంలో ఉన్న ప్రపంచ వ్యవస్థను సవాల్ చేయాలనే ఉద్దేశంతో 2009లో బ్రిక్స్ ఏర్పాటైంది.

**శాంతి స్థాపనలో సముచిత పాత్ర పోషించాలి: జిన్‌పింగ్**

వర్ధమాన మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన వేదిక బ్రిక్స్ కూటమి అని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. బ్రిక్స్ సదస్సులో శనివారం ఆయన ప్రసంగిస్తూ పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి ఈ కూటమి సముచిత పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో శాంతి, ప్రశాంతత కోసం బ్రిక్స్ సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు మారుతున్న కొద్దీ అక్కడ జరుగుతున్న యుద్ధం ఆ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని, అలాగే ఇది అంతర్జాతీయ సమాజం ఉమ్మడి ప్రయోజనాలకు అనుగుణంగా లేదని అన్నారు. సంభాషణలు, చర్చల ద్వారా పరస్పర అవగాహనను పెంపొందించుకోవాలని, విభేదాలను సముచితంగా పరిష్కరించుకోవాలని, బ్రిక్స్ సహకారం స్థిరంగా ముందుకు సాగేలా చూడాలని ఆయన సభ్య దేశాలను కోరారు.

**పాటించే స్థానం నుంచి పాలించే స్థితికి చేరుకోవాలి: మోదీ**

అభివృద్ధి చెందుతున్న దేశాలు నియమాలు పాటించే స్థితి నుంచి నియమాలు రూపొందించే స్థితికి చేరుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

# ఏకపక్ష యుద్ధాలు తగవు

## న్యూఢిల్లీ బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాల ఆమోదం

**న్యూఢిల్లీ:ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12**

బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో శనివారం భేటీ అయిన చైనా అధ్యక్షుడు జిన్ పింగ్.. 'ఇరు దేశాలు ఒకరి బలాల నుంచి మరొకరు పూర్తిగా నేర్చుకోవచ్చని, పరస్పరం మద్దతు ఇచ్చుకోవచ్చని' అన్నారు. ఏడేండ్ల తర్వాత తొలిసారి భారత్‌కు వచ్చిన జిన్‌పింగ్.. ప్రధాని మోదీతో చర్చలు జరిపారు.'నా పుట్టిన రోజున మీ దేశానికి రావాల్సిందిగా నాకు ఆహ్వానం అందింది. మనం 21 సార్లు కలుసుకున్నాం. పలు అంశాలలో ఏకాభిప్రాయానికి వచ్చాం. అవి చైనా-భారత్ సంబంధాలను స్థిరమైన అభివృద్ధి మార్గంలోకి నడిపించాయి' అని మోదీతో జిన్‌పింగ్ అన్నారు. 'చైనా ఎప్పుడూ భారత్‌తో తన సంబంధాలను వ్యూహాత్మక దీర్ఘకాలిక దృక్పథంతో చూసింది. మన రెండు దేశాల జాతీయ పరిస్థితులు భిన్నంగా ఉన్నప్పటికీ, ఒకరి బలాల నుంచి మరొకరం నేర్చుకోవచ్చు.కలిసి విజయాన్ని సాధించవచ్చు. అని అన్నారు. 'శతాబ్దంలో ఎన్నడూ చూడని మార్పులు, ఊహకందని మహమ్మారి పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో.. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లోని ముఖ్యమైన సభ్యులుగా చైనా, భారత్‌లు గణనీయమైన బాధ్యతలను భుజాన మోస్తున్నాయి.ప్రజల సంక్షేమంపై శ్రద్ధ వహిస్తూ, ప్రధాన దేశాలుగా తమ పాత్రను పోషించేందుకు కలిసి పనిచేయాలి. సమానత్వం, క్రమబద్ధతతో కూడిన ప్రపంచాన్ని మనం సమర్థించాలి. మన స్వప్రయోజనాలను ప్రైవేటీకరించకూడదు. ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధి, సుసంపన్నతకు మరింత సానుకూల శక్తిని అందించాలి' అని జిన్‌పింగ్ పేర్కొన్నారు.



# తెలంగాణలో దంచికొడుతున్న వానలు..

## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- తెలంగాణపై అల్పపీడన ప్రభావం.. రెండ్రోజులు వర్షాలే
- ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- గత 24 గంటల్లో పలుచోట్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదు
- ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద నీరు.. అప్రమత్తమైన అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కూడా ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది.**మిగతా 2 లో**




పొంగులేటిపై

# రేవంత్ గుస్సా..

## 22-ఏపై పసలేని ప్రసంగమని అసహనం!

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12**




రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. పసలేని ప్రసంగంతో సమయం వృథా చేశారని అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంలో చోటుచేసుకుంటున్న అవినీతి, అక్రమాలపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎక్కడిక్కడ నిలదీయడమే గాక ఆధారాలతో ప్రభుత్వ తీరును ఎండగడుగుతున్నది. ఈ క్రమంలో అసెంబ్లీలో శనివారం ఇదే అంశంపై మంత్రి పొంగులేటి ప్రత్యేక చర్చ పెట్టారు. దాదాపు 4గంటల పాటు ఏకబిగిన ప్రసంగించారు. ఒకవైపు తప్పు జరిగిందని అంగీకరిస్తూనే, మరోవైపు బీఆర్ఎస్‌పై నిందారోపణలకు దిగారు.బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సహా కేటీఆర్, హరీశ్‌రావులపై వ్యక్తిగత దూషణలకే ఎక్కువ సమయం కేటాయించారు. అయితే పొంగులేటి తీరుపై స్వయంగా ముఖ్యమంత్రే సీరియస్ అయినట్టు తెలిసింది. 4గంటలపాటు మాట్లాడినా విషయం ప్రజల్లోకి వెళ్లలేదని అసహనం వ్యక్తం చేశారని సమాచారం. సభా సమయం వృథా తప్ప ప్రభుత్వానికి ఒరిగిందేమీ లేకుండా పోయిందని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీవర్గాలే తెలుపుతున్నాయి. దీంతో 22ఏపై మాట్లాడేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నారని, అందుకే సభను 16కు

తాగుబోతుల

# ఆరోగ్యం ఏమౌతుంది..

## పుణెలో 10 రోజులపాటు మద్యనిషేధంపై

# హైకోర్టు ఆగ్రహం



**ముంబై, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా 10 రోజుల పాటు మద్యంపై నిషేధం విధించినందుకు పుణె పాలనా యంత్రాంగాన్ని బాంబే హైకోర్టు మందలించింది. మద్యానికి బానిసైన వ్యక్తులు 10 రోజుల పాటు మద్యం తీసుకోలేకపోతే వారితో దవాఖానలు కిక్కిరిసిపోవచ్చని కోర్టు వ్యాఖ్యానించింది. పుణెలో మాత్రమే మద్య నిషేధం విధించడంలోని ఔచిత్యం ఏమిటని ప్రధాన న్యాయమూర్తి ఎంపీ త్రిపాఠి, న్యాయమూర్తి అద్వైత్ సేథ్నాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ సందర్భంగా ప్రశ్నించింది.హైకోర్టు మందలింపు దరిమిలా 10 రోజుల మద్య నిషేధాన్ని పుణె యంత్రాంగం రెండు రోజులకు తగ్గించింది. 14వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 25వ తేదీ రోజంతా మద్యం అమ్మకాలు, వినియోగంపై యంత్రాంగం నిషేధం విధించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. మద్యం తాగి ఉన్నా లేకున్నా శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందేనని కోర్టు స్పష్టం చేసింది.

మొదటిపేజీ తరువాయి

# పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది.గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ., ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడించాయి.ఈ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# వినాయక చవితి వేళ... పురాణపండ 'గౌరీపుత్ర' సందడి



- పురాణపండ శ్రీనివాస్ 'గౌరీపుత్ర నమస్తేస్తు' గ్రంథం
- ఈ పుస్తకానికి భక్తుల నుంచి భారీ స్పందన
- వ్రతకల్పం, స్తోత్ర వ్యాఖ్యానాలతో ఆకట్టుకుంటున్న కంటెంట్
- అందమైన చిత్రాలు, నాణ్యమైన ముద్రణతో ప్రత్యేక రూపకల్పన
- వేల సంఖ్యలో భక్తుల చేతుల్లో కనిపిస్తున్న ఆధ్యాత్మిక గ్రంథం

త్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత, జ్ఞాన మహాయజ్ఞకేంద్రం వ్యవస్థాపకులు పురాణపండ శ్రీనివాస్ రచించిన 'గౌరీపుత్ర నమస్తేస్తు' అనే గ్రంథం గణేశ నవరాత్రుల సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు సహా పలు ప్రధాన నగరాల్లో ఈ పుస్తకానికి భక్తుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది.ఈ గ్రంథంలో శ్రీ వరసిద్ధి వినాయక వ్రతకల్పంతో పాటు ఆదిశంకరాచార్యులు, ప్రాచీన రుషులు రచించిన ముఖ్యమైన స్తోత్రాలు ఉన్నాయి. వీటికి పురాణపండ శ్రీనివాస్ అందించిన వ్యాఖ్యానం సరళమైన, సౌందర్యవంతమైన భాషలో ఉండటంతో పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటోందని ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అరుదైన గణపతి వర్ణ చిత్రాలు, ఆకర్షణీయమైన డిజైన్‌తో పుస్తకం ప్రత్యేకంగా నిలుస్తోంది. తెలంగాణ సచివాలయంలోని పలువురు అధికారులు సైతం పుస్తక రూపకల్పన, కంటెంట్‌ను మెచ్చుకుంటున్నారు.

# సిటీలో నిషేధిత మంటలు

## ప్రజల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న కాంగ్రెస్ సర్కార్..

## విలవిలలాడుతున్న లక్షలాది కుటుంబాలు

- సమగ్ర విచారణ చేయాలి.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- ఈ పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

- 300 ఇండ్లు జాబితాలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి - రాజశేఖర్‌రెడ్డి

పడిపోతున్న ధరలు

మేడ్చల్,త్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12:

భూ దోపిడీ దాహంతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు నిర్ణయంతో ప్రజల ఆస్తుల విలువలు తగ్గుతున్నట్లు బాధితులు ఆందోళన చెందుతున్నారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన క్రమంలో అమ్ముకుందామనుకుంటే కొనుగోలు దారులు ముందుకు రావడం లేదని బాధితులు తలలు పట్టుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాల ప్రజల ఆస్తులు నిషేధిత జాబితాలో చేర్చిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ బాధితుల తరపున పోరుబాట చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తేగా ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియ కొనసాగుతుంది.ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కూకట్‌పల్లిలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని సర్వే నంబర్లు నిషేధిత జాబితాలో కొనసాగుతున్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలోని బోడుప్పల్, మేడిపల్లి, మేడ్చల్‌లో ఉండగా మల్కాజిగిరి నియోజకవర్గంలో సుమారు 30 వేల ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకానగర్, కల్యాణిపురి, చర్లపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి మండలం 145, 163 సర్వే నంబర్లలో 50 ఏండ్ల క్రితం అనేక కాలనీలు ఏర్పడి 45 సంవత్సరాలు పూర్తయిన ఇండ్లు ఇప్పటికింకా నిషేధిత జాబితాలోనే కొనసాగుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో కొనుగోలు దారులు ముందుకు రావడం లేదు.గ్రేటర్ పరిధిలో ప్రజల నెత్తిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షల పిడుగు కురిపించింది. శాసనసభ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రంగారెడ్డి, మేడ్చల్-మలాజిగిరి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన జాబితాను వెల్లడించి కంటిమీద కునుకు లేకుండా చేశారు. దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన ఇళ్లు, ప్లాట్లు, అపార్ట్ మెంట్లపై ఒకసారిగా ప్రభుత్వం వివాదాస్పద, నిషేధిత భూములని ముద్ర వేయడంతో వేలాది కుటుంబాలు దికుతోచని స్థితిలోకి నెట్టబడ్డాయని నగరవాసులు ఆందోళనకు గురవుతున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వలేక దాటవేస్తూ, నిషేధిత భూముల జాబితా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మొదలైందని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లు, రుణాలు, రెవెన్యూ లావాదేవీలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ప్రాతిపదికన అడ్డుకుంటుందో సమాధానం చెప్పాలని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రభుత్వ అనాలోచిత వ్యాఖ్యలు, అర్ధరాత్రి హడావుడిగా తీసుకుంటున్న నిర్ణయాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం మరింత దిగజారిపోగా, సామాన్యుడి ఆస్తి విలువ క్షణాల్లో ఆవిరైపోతోంది.

-సిటీబ్యూరో, (నమస్తే తెలంగాణ)



కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 22ఏ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. శనివారం కూకట్‌పల్లి క్యాంప్ ఆఫీస్‌లో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, సామాన్యుల భూములు, నగరంలోని పలు ప్రాంతాల్లో యాభై ఏండ్లుగా నివాసం ఉంటున్న కాలనీల్లో ప్రైవేట్ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆ కాలనీల్లో ఇంటి స్థలాలను అమ్ముకోవాలన్నా, బ్యాంక్ రుణాలు తీసుకోవాలన్నా వీలు కావడం లేదని, కనీసం ఇంటి నిర్మాణం కోసం పర్మిషన్‌లు కూడా ఇవ్వడం లేదన్నారు. భూముల విషయంలో ఎక్కడైనా అక్రమాలు జరిగితే విజిలెన్స్ విచారణ జరపాలని కోరారు. రైతుల భూములను ఎవరైనా బలవంతంగా స్వాధీనం చేసుకున్నా, ప్రైవేట్ భూములను ప్రభుత్వ ఆస్తులుగా చూపించే ప్రయత్నాలు జరిగాయా అన్న అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ వ్యవహారాల్లో ఎవరెవరి పాత్ర ఉంది, ఏ పత్రాల ఆధారంగా ఎవరి ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకున్నారో తేల్చాలని కోరారు.

### పెరుగుతున్న జాబితా

రంగారెడ్డి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : నగర శివారులో 22ఏ నిషేధిత జాబితా భూ బాధితులు పెరిగిపోతున్నారు. మున్సిపాలిటీలు, మండలాల్లో ఉన్న అసైన్డ్, వక్ఫ్‌బోర్డు, భూదాన్ భూములను ప్రభుత్వం జల్లెడపట్టి మరీ నిషేధిత జాబితాలో చేర్చింది. సుమారు 20 వేల ఎకరాల వరకు ఉన్నట్టు బాధితులు చెబుతున్నారు. బాలాపూర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, శంషాబాద్, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో వక్ఫ్ బోర్డు, భూదాన్ భూములు ఎక్కువగా ఉన్నాయి. ఈ భూములను గ తంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు త ప్పుడు డ్యాకుమెంట్లను సృష్టించి వెం చర్లు చేసి ప్లాట్లుగా మార్చి ప్రజలకు విక్రయించారు.ఈ భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. దీంతో వాటిని అమ్ముకోలేక..బ్యాంకులకెళ్తే రుణాలు రాక పలువురు బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుర్కయాంజాల్, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, బొంగుళూరు, ఆదిబట్ల, తుక్కుగూడ, శంషాబాద్, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్ వంటి ప్రాంతాల్లో తమ పిల్లల వివాహాలు, ఇతరత్రా అవసరాల కోసం అనేక మంది అక్కడ ప్లాట్లను కొని రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నారు.తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంఎంకుంటలోని భూములన్నీ నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. 750 ఎకరాల భూమి ఉండగా 600 ఎకరాలను ఇప్పటికే రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా మార్చి ప్రజలకు విక్రయించారు. మిగిలిన 150 ఎకరాలు రైతుల ఆధీనంలో ఉన్నది. ఈ భూములన్నింటిని సర్కార్ నిషేధిత జాబితాలోకి చేర్చింది. నాదర్‌గుల్‌లో సర్వేనంబర్లు 597, 599, 615, 616, 617, 618 తమ పట్టా భూములను ప్రభుత్వం ఇటీవల నిషేధిత జాబితాలో చేర్చించిందని.. తహసీల్దార్, ఆర్డీవో అవి పట్టా భూములని నిర్ధారించినా తొలగించటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పొరపాట్లు సరిదిద్దుతాం

బడంగ్‌పేట్, సెప్టెంబర్12: బాలాపూర్ మండలంలోని ప్రైవేట్ భూమి 22ఏలో ఉన్నట్లయితే సరిదిద్దుతామని తహసీల్దార్ ఇందిరాదేవి తెలిపారు. ప్రభుత్వ భూమిని మాత్రమే 22ఏలో చేర్చామని, ఎక్కడైనా పొరపాటు జరిగితే సరిచేస్తున్నామన్నారు. ప్రైవేట్ భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేయకపోతే సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడి రిజిస్ట్రేషన్ చేయిస్తామని తెలిపారు. గతంలో 22ఏలో ఉన్న వాటిని యథావిధిగా కొనసాగిస్తున్నామన్నారు. యూఎల్‌సీ, ఎండోమెంట్, వక్ఫ్‌భూమి, అసైన్డ్ భూమి,భూదాన్ తదితర ప్రభుత్వ భూమిని 22ఏలో చేర్చినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని అనుసరించి కొన్ని ప్రైవేట్ సర్వే నంబర్లలో ఉన్న భూమిని ఎక్కడైనా 22ఏలో చేర్చినట్లు గుర్తిస్తే అధికారులను సంప్రదిస్తే సరిచేస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు.మండలంలో అనుమానాలు ఏమైనా ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయాలన్నారు.

### ఈ పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదే..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ పెత్తనం ఏమిటి.. ప్రభుత్వ భూముల దోపిడే కాకుండా ప్రజల ఆస్తులను గుంజుకునేలలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేసింది. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రజల ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించే వరకు బీఆర్ఎస్ బాధితుల తరపున నిలుస్తుంది. ప్రజల ఆస్తులను నిషేదిత జాబితాలో చేర్చి ప్రజల ఆస్తులను అమ్ముకోకుండా చేసిన పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదే. -- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

### మూడు వందల ఇండ్లు నిషేధిత జాబితాలో..

22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ప్రజల ఆస్తుల అనిశ్చితికి కాంగ్రెస్ ప్రభుత్వం కారణమైంది. నిషేధిత జాబితాలో ప్రజల ఆస్తులు చేరినందున వారికి విక్రయించే అవకాశం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వమే చేసింది. ప్రభుత్వం తొలగించినట్లు చెప్పిన ఇంకా ఆస్తులు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. మల్కాజిగిరి నియోజకవర్గంలోని యాప్రాల్ జూపల్లి హోమ్స్‌లో 3 వందల మందికి చెందిన ఇండ్లు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం బాధితుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తుంది.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136